క్లుప్తంగా

రైతులకు అండగా నిలుస్తాం..

మణుగూరురూరల్: రైతు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరు, భద్రాద్రి జిల్లా జానకీపురంలో ఇప్పటికే ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోగా, ముదిగొండ, రఘునాథపాలెం మండలాల్లో మరో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. అటు ప్రభుత్వ నిర్లక్ష్యం, ఇటు అధికారుల పట్టింపులేని తనంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కాగా, రైతులెవరూ అధైర్యపడొద్దని, వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని కాంతారావు ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మణుగూరుటౌన్: మండలంలోని తిర్లాపురం పంచాయతీలోని జీసీసీ పెట్రోల్ బంక్ వద్ద రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కాగా క్షతగాత్రులను 100 పడకల ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

వాలీబాల్ కిట్లు అందజేత

చర్ల: చర్లలో యువతకు భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ వాలీబాల్ కిట్లు అందజేశారు. చర్ల సీఐ ఏ.రాజువర్మ నేతృత్వంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువతకు 50 వాలీబాల్ కిట్లను అందజేసి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు పోలీసుశాఖ అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నర్సిరెడ్డి, సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

బూర్గంపాడు: హైదరాబాద్‌కు చెందిన ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బూర్గంపాడులోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. మంగళవారం సొసైటీ ప్రతినిధులు ఈ రెండు పాఠశాలల్లోని 150మంది విద్యార్థులకు స్కూల్‌బ్యాగులను అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు డాక్టర్ కపిల్, అర్చన, హెచ్ఎమ్ పద్మావతి, ఉపాధ్యాయులు పార్వతి, రమేష్; రూప్లా, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా ఉమ

మణుగూరుటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా మణుగూరు పట్టణానికి చెందిన చిత్తలూరి ఉమ ఎన్నికైంది. ఈ మేరకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ధారా రమేష్ నియామక పత్రం మంగళవారం అందజేశారు. తన ఎన్నికకు సహకరించి తన సేవలను గుర్తించిన దోసపాటి వెంకటేశ్వరరావు, లక్ష్మి, పెండ్యాల రోజ తదితర ముఖ్యులకు ఉమ ధన్యవాదాలు తెలిపారు.

సంత వేలం ఖరారు

బూర్గంపాడు: బూర్గంపాడు మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంత వేలంపాట మంగళవారం నిర్వహించారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి రామ్‌నరేష్, గ్రామపంచాయతీ ఈఓ సమ్మయ్య ఆధ్వర్యంలో ఈ సంత వేలం పాట ఏర్పాటు చేశారు. బూర్గంపాడుకు చెందిన మీరావలి రూ 1.94 లక్షలకు సంత వేలంపాటను దక్కించుకున్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న విద్యాభ్యాస ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ పాఠశాలలో లయన్ కముజు చంద్రమోహన్ జన్మదిన వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యప్రకాష్, సభ్యులు మీరాహుస్సేన్, గాజుల పూర్ణచందర్‌రావు, అడబాల నాగేశ్వరరావు, గాజుల రమేష్‌కుమార్, భూక్యా ప్రసాద్, విద్యాజ్యోతి ట్రస్ట్ కార్యదర్శి డి.రమేష్, పాఠశాల ప్రిన్సిపల్ జగన్మోహన్ రెడ్డి, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై మృతికి కారకులను శిక్షించాలి

మణుగూరుటౌన్: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని, మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల పట్టణ కార్యదర్శులు జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో తోట రమేష్, పట్టణ సహాయ కార్యదర్శి నాయుడు, ఆదర్ల రాములు, సీతారాములు, శ్రీరాముల రంగు ఆంజనేయులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసర సమయాల్లో సమాచారం ఇవ్వాలి
- గోదావరి వరదలు, పొంగే వాగుల దృష్ట్యా పోలీసులు ముందస్తు సూచన



గొందిగూడెంలో ఇసుకవాగును పరిశీలిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణలత



మణుగూరురూరల్: ముంపు ప్రభావిత గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం ముంపు ప్రాంతాలైన కమలాపురం, చిన రాయిగూడెంలను ఆయన సందర్శించి గ్రామస్తులకు వరదల పట్ల అవగాహన కల్పించారు. పలు సూచనలు ఇచ్చారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, అలాంటి సందర్భాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. వరదల పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూనే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అశ్వాపురం: వాగులు, వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణలత అన్నారు. మండల పరిధిలోని గొందిగూడెంలో ఇసుకవాగు ప్రవాహంతో అప్రోచ్ రహదారి కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో ఇసుకవాగు ప్రాంతాన్ని మంగళవారం సీఐ, తహసీల్దార్ సందర్శించారు. గిరిజనులు వాగు దాటకుండా చర్యలు చేపట్టారు. గిరిజనులు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సీఐ సూచించారు. చింతిర్యాలలో గ్రామస్తులతో సీఐ అశోక్‌రెడ్డి ప్రత్యేక సమావేశమై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉంటా..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: ఓ ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చిన తాను ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జరిగిన మండల చివరి సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ సున్నం లలిత, జెడ్పీటీసీ భారత లాలమ్మ, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావులకు శాలువాలు కప్పి, షీల్డ్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి అని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. విద్యార్థులకు నిర్వహించనున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కార్యక్రమంపై ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహాలక్ష్మి, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, సీడీపీఓ నిర్మాలా జ్యోతి, ఏడీఓ అఫ్జల్ బేగం, ఎంపీఓ షబ్నా, ఏఓ అనూష, డాక్టర్ ప్రియాంక, ఎంఈఓ సత్యనారాయణ, ఎస్సై చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయకాలనీలో వైద్య శిబిరం

చర్లరూరల్: మండలం కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ ఆదేశానుసారం మంగళవారం విజయకాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. 35 ఐదు మందికి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ పూజ.. సాధారణ జ్వర, ఇతర ఆరోగ్య సమస్యలు గల వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ఏఎన్ఎం స్వరూప, ఆశా కార్యకర్త ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని తేగడ సబ్ సెంటర్ ప్రాంతంలోని గర్భిణులకు వైద్య సిబ్బంది మంగళవారం పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ప్రతీరోజు తీసుకోవాల్సిన ఆహారంతో పాటు జాగ్రత్తలను తెలిపారు. వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మరోవైపు మండలంలోని లింగాపురంపాడు, దేవరపల్లి, బూరుగుపాడు, బోదనెల్లి తదితర గ్రామాలలో వైద్య సిబ్బంది రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించారు.

పల్లెల్లో ముమ్మరంగా ప్లాంటేషన్



అశ్వాపురం: మల్లెలమడుగులో మొక్క నాటుతున్న ఎంపీపీ సుజాత, తహసీల్దార్ స్వర్ణలత

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం, మొండికుంట, మల్లెలమడుగు గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో ఎంపీపీ ముత్తినేని సుజాత మొక్కలు నాటారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, వైస్‌ఎంపీపీ బేతం రామకృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, ఉపాధి హామీ ఏపీఓ సీతారాములు, ఈసీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ములకలపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ భారతి ప్రారంభించారు. ఎంపీటీసీ సంగపాటి మోహరమణి, ఎంఈఓ శ్రీరాంమూర్తి, ఎంపీఓ లక్ష్మయ్య, హెచ్ఎం కె.లత, ఈజీఎస్ ఏపీఎం హుసేన్, పీఆర్ ఏఈ సురేష్, సెక్రటరీ రవి, సంగపాటి సీతారాములు పాల్గొన్నారు.

తుమ్మలకు వినతుల వెల్లువ

దమ్మపేట: మండల పరిధిలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భద్రాచలం నుంచి వైజాగ్‌కు నడుపుతున్న లహరి బస్ సర్వీస్‌కు దమ్మపేటలో స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ డిపార్టమెంట్‌లోని వీఆర్వోలను వేర్వేరు డిపార్ట్‌మెంట్లకు కేటాయించడం వల్ల సీనియారిటీని కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని వీఆర్వోలు యూనియన్ తరఫున కోరారు. డీసీసీ బ్యాంక్‌లో ఏజెన్సీ ప్రాంత భూములకు కూడా మార్టిగేజ్ రుణ సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

నివాళులు..

గ్రామంలో మరణించిన మాజీ ఎంపీపీ పానుగంటి సత్యం చిత్రపటానికి మంత్రి తుమ్మల పూలతో మంగళవారం రాత్రి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమాల్లో పామాయిల్ బోర్డ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ అలపాటి రామచంద్రప్రసాద్, ఎంపీపీ సోయం ప్రసాద్, నాయకులు కొయ్యల అచ్యుతరావు, కేవీ.సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, వలీపాషా, గడ్డిపాటి సత్యం, పోతినేని వెంకట్రావు, చిన్నశెట్టి చిట్టిబాబు, కందుల వెంకటేశ్వరరావు, దొడ్డా ప్రసాద్, బండి భాస్కర్, చల్లగుల్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మోడుబారిన డివైడర్



చెట్లు తొలగించిన తర్వాత మోడుబారినట్టుగా కనిపిస్తున్న డివైడర్

దమ్మపేట: మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై గల డివైడర్ మధ్యలో పచ్చదనం లేక మోడుబారినట్టుగా మారింది. మంగళవారం దమ్మపేట గ్రామ పంచాయతీ వారు డివైడర్‌పై ఉన్న కోనో కార్పస్ మొక్కలను అన్నింటిని పూర్తిగా నరికించేశారు. దీనితో ప్రతినిత్యం మొక్కలతో పచ్చదనంను ప్రదర్శించే డివైడర్ ఒక్కసారిగా మోడుబారి పోయింది. లక్షల రూపాయలు వెచ్చించి, పెంచిన మొక్కలను తొలగించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి సురేష్‌ను వివరణ కోరగా.. కోనో కార్పస్ మొక్కలు మానవాళి ఆరోగ్యానికి హానికరం అనే ఉద్దేశంతో తొలగించామని అన్నారు. అంతేగాక దమ్మపేటలో ప్రస్తుతం ఉన్న డివైడర్‌ను మరో రెండున్నర అడుగుల ఎత్తుకు పెంచుతూ, సెంట్రల్ లైటింగ్ కూడా మంజూరు అయిందని అన్నారు. కాగా డివైడర్ మధ్యలో కరెంటు వైరింగ్ పనుల నిమిత్తం కూడా మొక్కలను తొలగించాల్సి వచ్చిందని, నూతన డివైడర్ పనులు పూర్తికాగానే మధ్యలో పూలమొక్కలను నాటి, పెంచుతామని తెలిపారు.

మంత్రి తుమ్మల పరామర్శ

దమ్మపేట: ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొండ్రు ప్రసాద్ మాతృమూర్తి లక్ష్మీదేవి చిత్రపటానికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం నివాళులర్పించారు. అంకంపాలెంలో కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పరామర్శలో మంత్రితో పాటుగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎంపీపీ సోయం ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్ ఉన్నారు.

పొదెంకు చైర్మన్ పదవి రావడంపై హర్షం

దుమ్ముగూడెం: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు విరమాచినేని వినీల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వినీల్ మాట్లాడుతూ.. వీరయ్యకు ఆ పదవి ఇవ్వడం విధేయతకు కట్టిన పట్టం అని అభివర్ణించారు. కార్యక్రమంలోనాయకులు నటరాజ స్వామి, గడ్డం బాలాజీ, జిల్లా సోషల్ మీడియా మాజీ చైర్మన్ కనుబుద్ది దేవా, కెల్లా శేఖర్, తెల్లం హరికృష్ణ, డింగి సందీప్ రెడ్డి,సరియం వీర్రాజు, వర్ష చిన్నారావు, కట్టాం కృష్ణ, మున్నా, తోటమల్ల సంగీతరావు, లంకా పూర్ణచంద్రరావు, దాట్ల వినోద్, గుమ్మడి శ్రీను, కాక రాజు, ముత్యాలు, అట్టం నాగేశ్వరావు,గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరసనను విజయవంతం చేయాలి

మణుగూరురూరల్: నేడు కార్మికుల కోర్కెల దినంగా పాటించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సత్రపల్లి సాంబశివరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్టీసీ, మున్సిపల్, హమాలీ కార్మికులతో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల అమలుకు, బొగ్గు బ్లాకుల వేలానికి పూనుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో పలు డిమాండ్లపై నేడు నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వివిధ రంగాల కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో సీఐటీయూ నాయకులు పల్లపు నాగేశ్వరరావు, దుర్గారావు, రవి, హమాలీ నాయకులు సుధాకర్, ఆర్ శ్రీను, సాంబయ్య, రెడ్డి, మల్టీపర్పస్ వర్కర్లు రవి, స్వరూప, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సదస్సును వినియోగించుకోండి

దమ్మపేట: విద్యుత్ వినియోగదారుల సదస్సు (లోకల్ కోర్టు)ను వినియోగించుకోవాలని, మండలంలోని గండుగులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ మహేష్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. నేడు(బుధవారం) గండుగులపల్లి గ్రామంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, వోల్టేజిలో హెచ్చుతగ్గులు, నూతన సర్వీసులు, కేటగిరి మార్పులు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ తదితర సమస్యలపై దరఖాస్తులను, సదస్సులో సంబంధిత అధికారులకు అందజేయవచ్చని తెలిపారు.

ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించాలి

బూర్గంపాడు: రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధిహామీ కూలీలతో సమావేశమైన ఆయన వారి సమస్యలు తెలుసుకున్నారు. వేతనాలు చెల్లించకపోతే ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే సాబ్.. ఈ పల్లె గుర్తుందా!?



కల్వర్టు దగ్గర దిగబడిన ఆటోను తోస్తున్న దృశ్యం



నాడు కల్వర్టుకు గొయ్యి పడ్డ ప్రాంతానికి ఎమ్మెల్యేను తీసుకెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టుకు గోతి పడి వాహనాలు వెళ్లడం కష్టతరంగా మారింది. పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా గ్రామానికి రహదారి నిర్మాణం, కల్వర్టు నిర్మాణం చేస్తేనే ఓటింగ్‌లో పాల్గొంటామని స్థానికులు నాడు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధికారులు గ్రామస్తులతో చర్చించి రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో గ్రామస్తులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. తీరా ఎన్నికలు ముగిశాయి గాని కల్వర్టు నిర్మాణ పనులు మొదలు కూడా కాలె. ఈ నేపథ్యంలో తాజాగా మంగళవారం ఓ ఆటో కల్వర్టు వద్ద దగబడగా.. గ్రామస్తులు దానిని నెడుతూ ఎలాగోలాగ గట్టుకు చేర్చారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయని, ఒక వాహనం ఆ కల్వర్టు దాటించడానికి పది మంది వరకు మనుషులు కవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తక్షణమే ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టి గ్రామస్తుల బాధలను తీర్చాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు డిమాండ్ చేశారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు

కరకగూడెం: యుద్ధప్రాతిపదికన చిరుమళ్ల బ్రిడ్జి, రాయణపేట చిర్రకుంట చెరువుకు మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పినపాక డివిజన్ ఇరిగేషన్ ఈఈ టి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం చిరుమళ్ల బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోతకు గురైన సదరు బ్రిడ్జి మరమ్మతుల కోసం సుమారు రూ.10 లక్షల నిధులు సోమవారం విడుదల చేశారని తెలిపారు. అంతేకాకుండా ఇసుక బస్తాలతో బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రహదారికి రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు.

అలాగే పెద్దవాగులోని ఇసుక మేటలను కూడా తొలగించనున్నట్లు తెలిపారు. అనంతరం వర్షాలకు చిర్రకుంట చెరువు కట్టకు పడిన రంధ్రాన్ని పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతు పనులు వెంటనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. డీఈ రమేష్ బాబు, ఏఈఈ సక్కు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల జోరు వాన



కరకగూడెం: వృద్ధురాలి గుడిసెలోకి చేరిన వర్షపు నీరు

మణుగూరుటౌన్: మండలంతో పాటు పట్టణంలో సోమవారం రాత్రి మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రోడ్డుపై వరద నీరు పెద్ద ఎత్తున నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వినాయక నగర్ పూర్తి ముంపునకు గురయ్యాయి. సుందరయ్యనగర్‌లో రోడ్లన్నీ జలమయం కాగా కొందరి ఇండ్లలోకి వరద నీరు చేరింది. సమితిసింగారంలోని అగ్ని మాపక కేంద్రం పరిసరాల్లోకి వరద నీరు భారీగా చేరి ఉద్యోగుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కట్టు వాగు ఉధృతంగా ప్రవహించడంతో సుందరయ్యనగర్ గ్రామస్తులు భయాందోళన చెందారు. సింగరేణిలో ఓబీ వెలికితీతకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అధికార వర్గాలు తెలిపాయి.

కరకగూడెం: మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది.గత నెలలో మండలంలో అంతగా వర్షాలు పడకపోవడంతో సాగు పనులు ముందుకు సాగలేదు. అన్నదాతలు ఇప్పటివరకు తీవ్ర నిరాశలో ఉండగా తాజాగా కురిసిన వర్షాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు కోసం పొలాలను దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమవుతున్నారు. అంతేకాకుండా కొద్ది రోజులుగా వర్షాలు లేక రైతులు వరి నాట్లు వేయలేదు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, వరి పంటల రైతులకు సంతోషాన్ని ఇచ్చింది. పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి వరద వచ్చి చేరింది. కాగా కరకగూడెం ఎస్సీ కాలనీలో నైనారపు లక్ష్మీ అనే వృద్ధురాలి గుడిసేలోకి వర్షపు భారీగా చేరింది.అప్రమత్తమైన ఆమె ఇంటి పక్కన వారు ఆమెను వారి ఇంట్లోకి తీసుకెళ్లారు.

తండాల్లో సీత్లా పండుగ



దేవతల వద్ద పూజలు చేస్తున్న మహిళలు

గుండాల: విరివిగా వానలు కురిసి.. పాడిపంటలు పండాలని మండలంలోని పలు తండాల వాసులు కులదేవతలను వేడుకున్నారు. ఆచార సాంప్రదాయాలతో మంగళవారం మండల కేంద్రంతో పాటు నర్సాపురం, రోళ్లగడ్డ తండా వాసులు సీత్లా (దాటుడు) పండుగ నిర్వహించారు. మహిళలంతా ప్రత్యేక పూజలతో ఏడు రకాల వంటలను తయారు చేసి, తలలపై పెట్టుకుని డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేశారు. గ్రామ పొలిమేరల్లో ఉన్న గ్రామ, కుల దేవతలకు నైవేద్యంగా సమర్పించుకున్నారు. పోతురాజు దేవుడి వద్ద మేకలను, కోళ్లను బలిచ్చారు. వంటలను పశువులపై చల్లి(పొలి), గండాలను, రోగాలను తొలగించాలని వేడుకున్నారు. పాటలు పాడుకుంటూ, నృత్యాలు చేశారు.

మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క(అనసూయ) జన్మదిన వేడుకలు మంగళవారం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆరిఫ్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీలంటే అమితమైన ప్రేమ అభిమానం ఉన్న వ్యక్తి సీతక్క అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ముంపుపై స్పష్టతనివ్వాలి

బూర్గంపాడు: పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక, మోతె, ఇరవెండి గ్రామాలకు ముంపు పొంచివుందనే ప్రచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ అన్నారు. మంగళవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు బూర్గంపాడు మండలంలోని గ్రామాలపై ముంపుపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలపై వినతులు

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఆయా మండలాల్లోని తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఎటువంటి షరతులు లేకుండా వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద రూ.15వేలు ఇవ్వాలని వినతుల్లో డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చంద్రుగొండ: తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు



మణుగూరురూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



భద్రాచలంటౌన్: వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు